క్లుప్తంగా

అడవివరం హైస్కూల్ టెన్త్ టాపర్లకు ఆర్జేడీ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్జేడీ విజయ్‌భాస్కర్

సింహాచలం: పదోతరగతి పరీక్షల్లో అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్లో టాపర్లుగా నిలిచిన విష్ణువర్ధన్ సాయి(588), కవిత(574)లను పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ విజయ్‌భాస్కర్ తన కార్యాలయంలో గురువారం పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అదించడం ద్వారానే మెరుగైన ఫలితాలు సాధించగలమని, ఆ దిశగా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, కఠినమైన శ్రమతో ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతుల అనంతరం మినీ వాటర్ ట్యాంకు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో మరమ్మతులతో మూల్గుతున్న మినీ వాటర్ ట్యాంకుకు అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 9న 'బీటలు వారి.. నీరుగారుతూ..'శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. పెచ్చులూడిపోయిన పిల్లర్లు, నీరు చిమ్ముతున్న శ్లాబ్‌కు పంచాయతీ నిధులతో మరమ్మతులు చేపట్టి, సున్నాలు వేశారు. ట్యాంకు లీకులు అరికట్టి వేసవిలో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య తెలిపారు.

చందనం అరగదీత సిబ్బందికి నూతన వస్త్రాల పంపిణీ



సిబ్బందికి పంచెలు అందిస్తున్న ఈవో సుబ్బారావు

సింహాచలం: సింహగిరిపై గురువారం నుంచి ప్రారంభమైన తొలి విడత చందనం అరగదీతను పురస్కరించుకుని అరగదీతలో పాల్గొన్న సిబ్బందికి దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు నూతన వస్త్రాలు అందించారు. ఆలయ బేడా మండపంలో జరిగిన కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు, ఏఈవో ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



ఆలయ సూపరింటెండెంట్‌కు నగదు అందిస్తున్న దాత పైడితల్లి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం అడవివరానికి చెందిన లోగిశ వరాహనరసింహం, పైడితల్లి దంపతులు లక్షా ఒక్క రూపాయి విరాళమిచ్చారు. ఉదయం ఆలయానికి వచ్చిన పైడితల్లి సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులకు అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్ పాల్గొన్నారు.

చందనోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన గంటా



ప్రసాద్ పథకంలో నిర్మించిన క్యూకాంప్లెక్స్‌ను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న గంటా

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మాడ వీధుల్లో ఏర్పాటుచేసిన క్యూలైన్లపై ఆరా తీశారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావు, ఈఈ శ్రీనివాసరాజు ఏర్పాట్లను వివరించారు. అనంతరం ప్రసాద్ పథకంలో నిర్మించిన క్యూకాంప్లెక్స్‌ను కొబ్బరికాయ కొట్టి గంటా ప్రారంభించారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల



అటల్ ల్యాబ్‌లో విద్యార్థుల ప్రాజెక్టులను పర్యవేక్షిస్తున్న సైన్స్ టీచర్ రాంబాబు





సబ్బవరం గురుకుల పాఠశాల విద్యార్థులు

పాఠశాల స్థాయిలో విద్యార్థులపై కాస్త శ్రద్ధ చూపితే.. వారు అద్భుతాలు ఆవిష్కరించగలరు. వారిలో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనలకు పదునుపెడితే నూతన ఆవిష్కరణలు అలవోకగా వస్తాయి. అందుకే కేంద్ర ప్రభుత్వం పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్)ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏటీఎల్ ఏర్పాటు తర్వాత విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలకు పదునుపెట్టేలా సిబ్బంది తర్ఫీదునిస్తున్నారు. అద్భుతాల ఆవిష్కరణకు మార్గదర్శనం చేస్తున్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌తో అద్భుతాల ఆవిష్కరణ

- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ
- విద్యార్థుల్లో పరిశీలనాశక్తి, సృజనాత్మకత వెలికితీసేలా తర్ఫీదు
- రూ.20 లక్షలతో గురుకుల పాఠశాలలో అటల్ ల్యాబ్ ఏర్పాటు

సబ్బవరం:

విద్యార్థుల్లో సృజన, శాస్త్రీయ దృక్పథం అలవడేలా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు సాయపడుతున్నాయి. భవిష్యత్‌లో మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలకు పాఠశాల స్థాయి నుంచే నూతన ఆవిష్కరణలు రూపొందాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్ మిషన్(ఏఐఎం)ను స్థాపించింది. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా ఉన్న అనేక ప్రభుత్వ పాఠశాలలో నీతి ఆయోగ్ నిధులతో ఈ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగానే స్థానిక గురుకుల పాఠశాలలో ఐదేళ్ల క్రితం ఈ ల్యాబ్ ఏర్పాటయింది. అప్పటి నుంచి విద్యార్థులు తమ సృజనకు పదును పెడుతూ పలు ఆవిష్కరణలతో సత్తా చాటుతున్నారు.

గురుకుల ప్రాజెక్టుల్లో మేటి

స్థానిక గురుకులంలో సుమారు 550 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులు ప్రతి రోజూ నూతన ఆలోచనలకు పదునుపెట్టేలా ఏటీఎల్ ద్వారా సిబ్బంది ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో స్థానిక గురుకుల విద్యార్థుల 5 ప్రాజెక్టులు ప్రదర్శనకు ఎంపిక య్యాయి. ఇందులో రెండు ప్రాజెక్టులు ఉత్తమంగా నిలిచి, బహుమతులు పొందాయి. దీంతోపాటు యువ ఫెస్టివల్‌లో గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించగా, గ్రూప్ విభాగంలో ప్రథమ స్థానంలోను, వ్యక్తిగత విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాయి.

జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి..

అటల్ ల్యాబ్‌ను వినియోగించుకుని గురుకుల విద్యార్థులు తమ సృజనకు పదును పెడుతున్నారు. వివిధ ప్రాజెక్టులు రూపొందించి, జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో సత్తా చాటారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయిలో నిర్వహించిన ఏటీఎల్ మారథాన్ పోటీలో కూడా పాల్గొని ప్రతిభ కనబరిచారు. అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 20 వేల ప్రాజెక్టులు ఈ పోటీలకు రాగా, తొలి దశలో 300 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. వీటిపై బూట్ క్యాంప్ నిర్వహించి టాప్ 100 ప్రాజెక్టులను వివిధ ఇంక్యుబేషన్ సెంటర్లకు అప్పగించారు. ఈ పోటీలో గురుకుల పాఠశాల ప్రాజెక్టు స్మార్ట్ డ్రైనేజ్ క్లీనింగ్ సిస్టంను అనంతపురంలోని శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీలో ఉన్న ఇంక్యుబేషన్ సెంటర్‌కు అప్పగించారు. జె.సందీప్(9వ తరగతి), జి.గుణశేఖర్(10వ తరగతి)లు 10 రోజులపాటు ఈ యూనివర్సిటీ ఇంక్యుబేషన సెంటర్‌లో సాంకేతిక పరిజ్ఞానంలో తర్ఫీదు పొందారు.

స్మార్ట్‌గా యూజీడీ సమస్యకు పరిష్కారం

స్థానిక గురుకుల విద్యార్థుల ఆలోచల్లో పుట్టి, ఏటీఎల్ మారథాన్‌లో ఎంపికైన స్మార్ట్ డ్రైనేజ్ సిస్టం ప్రాజెక్టు గురుకుల స్థాయిని పెంచింది. ఈ ప్రాజెక్టు భూగర్భ మురుగునీటి వ్యవస్థ(యూజీడీ)లో మురుగు ఓవర్ ఫ్లో స్థాయికి చేరుకున్నపుడు ముందుగానే గుర్తిస్తుంది. ఆ సమాచారాన్ని సంబంధిత అధికారులకు చేరవేయడంతో పాటు, తనకు తానుగానే డ్రైనేజీని సరి చేస్తుంది. దేశంలోని ప్రధాన పట్టణాల్లో అతి పెద్ద సమస్య డ్రేనేజీ లీకులు. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లి, ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఎక్కువ. దీనికి పరిష్కారం చూపాలనే లక్ష్యంతో విద్యార్థులు తమ సృజనకు పదునుపెట్టారు. అందుకే ఈ ప్రాజెక్టు ఇంక్యుబేషన్ సెంటర్‌కు ఎంపికైంది.



విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ యూజీడీ ప్రాజెక్టును పరిశీలిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి(ఫైల్)

ఆలోచనలు ఆచరణగా..



విద్యార్థులు చిన్నప్పటి నుంచే సమాజంలోని అనేక అంశాలను పరిశీలనాత్మకంగా చూసేందుకు, వాటికి పరిష్కారాలను చూపేందుకు అటల్ ల్యాబ్‌లు ఎంతగానో దోహదపడుతున్నాయి. తమ ఆలోచనల్ని ఆచరణలో చూపేందుకు అవసరమైన సాధనాసంపత్తిని ఈ ల్యాబ్‌లు సమకూర్చుతున్నాయి. దీంతో నిత్యం విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెడుతూ, టీచర్ల సాయంతో నూతన ఆవిష్కరణలు చేసి, అబ్బుర పరుస్తున్నారు.

– రాంబాబు, సైన్స్ టీచర్, ప్రోగ్రాం గైడ్

గ్రామీణ విద్యార్థులకు వరం



గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎందులోనూ తక్కువ కాదు. వారికి అవసరమైన వనరులను అందుబాటులో ఉంచితే అద్భుతాలు చేసి చూపగలరు. ఇలాంటి వారికి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మా గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లో గడిపేందుకు పిల్లలు చాలా ఉత్సాహం చూపుతారు. వారి ఆలోచనలకు పదును పెట్టేందుకు అవసరమైన అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

– ఎస్.రామకృష్ణ, ప్రిన్సిపాల్

గ్రామీణాభివృద్ధిలో పంచాయతీలే కీలకం



పరవాడలో గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు



సబ్బవరంలో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మండల పరిషత్ సిబ్బంది



జెడ్పీలో ఎంపీపీ బోకం సూర్యకుమారిని సత్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

పరవాడ: గ్రామీణాభివృద్ధిలో గ్రామ పంచాయతీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కార్యాలయంలో గురువారం మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం కోసం ప్రభుత్వం నిధులను నేరుగా పంచాయతీలకు విడుదల చేస్తుందన్నారు. ఈ నిధులు వినియోగించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పాలకవర్గం, పంచాయతీ సిబ్బంది కృషి చేయాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్య రంగాల్లో చేపడుతున్న అభివృద్ధిని ఎంపీపీ వివరించారు. గ్రామ పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించి ప్రజల జీవితాల్లో గుణాత్మకమైన మార్పులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వి.ధర్మారావు, కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, ఎంఈవో దివాకర్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా కనకరావు, బొద్దపు చిన్నారావు, పైల రాధాకృష్ణ, వర్రి హరి, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో శివప్రసాదరావు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

ఎంపీపీ సూర్యకుమారికి సత్కారం

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోకం సూర్యకుమారిని ఘనంగా సత్కరించారు. మండల పరిధిలో చేసిన సేవలను గుర్తించి, విశాఖ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా ఆమెకు శాలువా వేసి, జ్ఞాపికను అందించారు. సత్కరించిన వారిలో కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ జె.సుభద్ర తదితరులు ఉన్నారు.

వైభవంగా.. గ్రామ దేవతల పండగ



జల్లెలపాలెం మరిడిమాంబ సన్నిధిలో ఎమ్మెల్యే పంచకర్ల, స్థానిక నాయకులు

పరవాడ: రావాడ శివారు జల్లెలపాలెం, వెన్నలపాలెం గ్రామ దేవతలు మరిడిమాంబ, దుర్గమాంబ అమ్మవార్లపండగ మహోత్సవాలను ఆయా గ్రామాల ప్రజలు గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అమ్మవార్లను దర్శించుకుని, పూజలు జరిపి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వెన్నలపాలెం దుర్గమాంబను దర్శించుకుని, పూజలు చేశారు. వేకువ జాము నుంచే భక్తులు బారులు తీరి, అమ్మవార్లకు పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో ప్రసాద వితరణ చేశారు. డప్పు వాయిద్యాలు, చిడతలు, తప్పెటగుళ్లు, నేల డ్యాన్సులతో గ్రామ దేవతలను పురవీధుల్లో ఊరేగించారు. బాణసంచా వెలుగుల మధ్య అమ్మవార్ల అనుపు మహోత్సవాలను వైభవంగా జరిపారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రావాడ, పరవాడ, ఈ బోనంగి సర్పంచ్‌లు మోటూరి సన్యాసినాయుడు, సిరపరపు అప్పలనాయుడు, బొద్దపు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, గ్రామ పెద్దలు వియ్యపు చిన్న, దుల్ల రామునాయుడు అమ్మవార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పట్టపగలూ హైమాస్ట్ లైట్ల వెలుగులు



గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు

పరవాడ: మండలంలో గొర్లివానిపాలెం జేఎన్ఎన్ యూఆర్ఎం కాలనీలో హైమాస్ట్ వీధి దీపాలు పగలూరాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. విద్యుత్‌ను ఆదా చేయాలని పదేపదే సంబంధిత అధికారులు ప్రజలకు సూచనలిస్తున్నా.. పంచాయతీ సిబ్బంది అవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాత్రి వేళ వెలిగించిన వీధి దీపాలను తెల్లవారగానే ఆర్పాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన ఇవి పగటిపూటా వెలుగుతూనే ఉన్నాయి. వీధి దీపాల పర్యవేక్షణపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేల బావిలో పడి మేకల కాపరి మృతి



మృతుడు నంబారు చినఅప్పారావు(ఫైల్)

సబ్బవరం: మండలంలోని నారపాడు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నేల బావిలో పడి మృతి చెందాడు. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నంబారు చిన అప్పారావు(58) బుధవారం మేకలు, గొర్రెలను గ్రామానికి దూరంగా మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం అయ్యేసరికి మేకలు ఇంటికి చేరుకున్నాయి కానీ.. వెంట వెళ్లిన కాపరి ఇంటికి చేరుకోలేదు. దీంతో గ్రామస్తులు చుట్టు పక్కల గాలించినా ఆచూకీ కనిపించలేదు. ఊరికి దూరంగా ఉన్న నేల బావి వద్ద గురువారం సాయంత్రం చెప్పులు కనబడటంతో బావిలో వెతికారు. అందులోనే అప్పారావు మృతదేహం లభ్యమయ్యింది. మృతుడికి భార్య పైడమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు లోవరాజు ఫిర్యాదు మేరకు సబ్బవరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

క్షయ రోగులకు పోషకాహార కిట్ల పంపిణీ



క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందిస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి కనకప్పారావు

పరవాడ: క్షయ వ్యాధిగ్రస్తులు వైద్యుల సూచనల మేరకు మెరుగైన పోషకాహారం, మందులు తీసుకోవడం ద్వారా త్వరితగతిన నయం చేసుకోవచ్చని వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కనకప్పారావు సూచించారు. పేద క్షయ వ్యాధిగ్రస్తులకు స్థానిక పీహెచ్‌సీలో పోషకాహార కిట్లను గురువారం పంపిణీ చేశారు. అచ్యుతాపురం టీబీ యూనిట్ పరిధిలోని వాడచీపురుపల్లి పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా నలుగురు క్షయ రోగులకు వైద్యాధికారి పోషకాహార కిట్లను అందంచారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలి



ఉగ్రదాడి మృతులకు రత్నగిరినగర్ పార్కులో నివాళులర్పిస్తున్న కాలనీవాసులు

పెందుర్తి: అమాయకులను అత్యంత కిరాతకంగా హతమార్చిన పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రమూకకు ఖచ్చితంగా తగిన బుద్ధి చెప్పాలని రత్నగిరినగర్ కాలనీ పార్కు వాకర్స్, కాలనీ ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో అశువులు బాసిన 28 మంది ఆత్మలకు శాంతి చేకూరాలని గురువారం పార్కులో కాసేపు మౌనం పాటించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత్ ఎదుగుదలను చూసి తట్టుకోలేకే పాకిస్థాన్ ఉగ్రవాదులను మన దేశం మీదికి ఉసిగొల్పుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనపై ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా సింహాచల్‌నగర్ ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



ప్రోగ్రెస్ కార్డులు అందుకున్న తల్లులతో హెచ్ఎం గేదెల సన్యాసిరావు

సింహాచలం: 98వ వార్డు పరిధి సింహాచల్‌నగర్‌లో ఉన్న ఎంపీపీ స్కూల్ వార్షికోత్సవాన్ని, మెగా పేరెంట్స్ డేని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అందించారు. తరగతుల వారీ ప్రతిభ చూపిన విద్యార్థులతోపాటు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాలలో తమ పిల్లలకు అందుతున్న విద్యా బోధనపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గేదెల సన్యాసిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి వ్యతిరేకంగా శాంతి ర్యాలీ



పెదగంట్యాడ కూడలి వద్ద బీజేపీ నాయకుల మానవహారం

పెదగంట్యాడ: పెహల్గాంలో ముష్కరుల తూటాలకు బలైన మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, ఉగ్రవాదులు ఇలాంటి చర్యల వల్ల భారతీయుల ఐక్యత, దేశ సమగ్రతలను బలహీనపరచలేరని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో శాంతి ర్యాలీ నిర్వహించి పాకిస్తాన్ టెర్రరిజం నశించాలి అంటూ నినాదాలు చేశారు. విహారయాత్రకు వెళ్లిన వారిని ఇలా చంపడం అత్యంత బాధకరమన్నారు. అనంతరం మనవహారం నిర్వహించి మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పేర్ల అప్పారావు, కిల్లాన ముసలయ్య, జిలకర్ర రమణ, భువనేశ్వరి పాల్గొన్నారు.

సబ్బవరం సీఐ రమణ బదిలీ



పి.రమణ, సీఐ

సాక్షి, విశాఖపట్నం: సబ్బవరం సీఐ పిన్నింటి రమణ బదిలీ అయ్యారు. విశాఖ రేంజ్ పరిధిలో 9 మంది సీఐలకు గురువారం బదిలీలయ్యాయి. విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న బెండి వెంకట్రావ్‌ను అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా సైబర్ సెల్‌కు, వీఆర్‌లో ఉన్న జి.రామచంద్రరావును సబ్బవరం అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు, అక్కడ పనిచేస్తున్న పి.రమణను విశాఖ రేంజ్ వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూ ఐటీఐలోని డ్రైవింగ్ స్కూల్లో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. పదో తరగతి పాసై, 18 ఏళ్లు నిండి ఉండాలన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల 5 తేదీ లోగా తమ ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9491762841, 9989014703 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.